ప్రయాణం.. నరకప్రాయం

రెండున్నర కి.మీ. మార్గం గోతులమయం

రోడ్డంతా రాళ్లు తేలిన వైనం

రాకపోకలకు ప్రయాణికుల అవస్థలు



మరికమ్మ చెరువు కల్వర్టు వద్ద గోతులు పడిన విలాస్కాన్‌పాలెం-బాందేవుపురం రోడ్డు

పద్మనాభం: మండలంలోని పలు ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో ఈ రోడ్లపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. విలాస్కాన్‌పాలెం-బాందేవుపురం బీటీ రోడ్డు దారుణంగా ఉంది. సుమారు రెండున్నర కిలోమీటర్ల నిడివి గల ఈ రోడ్డు గోతులు పడింది. ఈ రహదారిపై విలాస్కాన్‌పాలెం, బాందేవుపురం గ్రామ ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. మద్ది, తునిపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు, ప్రయాణికులు విలాస్కాన్ పాలెం, విజయనగరం జిల్లా జామి మండలం అన్నంరాజుపేట, జామి గ్రామాలకు పయనిస్తుంటారు. రోడ్డు మొత్తం గోతులు పడడంతో ప్రయాణికులు నిత్యం నరకం చూస్తున్నారు.

రైతుల అవస్థలు

ఈ రోడ్డుకు ఇరుపక్కలా మద్ది, విలాస్కాన్ పాలెం గ్రామాలకు చెందిన రైతుల పొలాలు ఉన్నాయి. ఈ పొలాల్లో ఖరీఫ్ సీజన్‌లో వరి, రబీ సీజన్‌లో మొక్కజొన్న పంటలు వేస్తుంటారు. రోడ్డు శిథిలమవడంతో పక్వానికి వచ్చిన తరవాత పంటను ఇళ్ల వద్దకు ఎడ్ల బళ్లపై తీసుకువెళ్లడం రైతులకు కష్టమవుతోంది.

కోరాడ పంచాయతీ గెద్దపేట నుంచి భీమిలి మండలం దాకమర్రి వెళ్లే రెండు కిలోమీటర్ల నిడివి గల రోడ్డు గోతులు పడింది. దీనిలో కిలో మీటరు నిడివి గల బీటీ రోడ్డు గోతులు పడి రాళ్లు తేలిపోయింది. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద సుమారు అర కిలోమీటరు నిడివి గల మట్టి రోడ్డు గోతులు పడి వర్షాలకు బురదమయంగా తయారవుతోంది. దమ్ము పట్టిన పొలంలా తయారవడంతో ద్విచక్ర వాహనచోదకులు జారిపడుతున్నారు. ఈ రోడ్డు రెడ్డిపల్లి, కృష్ణాపురం, దువ్వపేట, పొట్నూరు, పద్మనాభం, అర్చకునిపాలెం గ్రామాలకు చెందిన వారు దాకమర్రి వెళ్లడానికి ఉపయోగపడుతుంది. ఈ రోడ్లు శిథిలమై రెండేళ్లు కావస్తున్నా సంబంధిత శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



గెద్దపేట సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద బురదమయమైన రోడ్డు



గోతులు పడిన గెద్దపేట-దాకమర్రి రోడ్డు



బాందేవుపురం పొలాల వద్ద గోతులు పడిన రోడ్డు

గోతులతో అవస్థలు



విలాస్కాన్‌పాలెం అర్‌అండ్‌బీ రోడ్డు నుంచి బాందేవుపురం వరకు సుమారు రెండున్నర కిలో మీటర్ల నిడివి గల రోడ్డు శిథిలమైంది. రోడ్డు గోతులు పడింది. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడుతున్నాం. రోడ్డును ఆనుకుని మా పొలాలు ఉన్నాయి. ఖరీఫ్, రబీ సీజన్లలో పండిన పంట దినుసులను పొలాల్లో నుంచి కళ్లాలకు, ఇళ్లకు ఎండ్ల బళ్లపై తీసుకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నాం.

– బి.నాగరాజు, విలాస్కాన్‌పాలెం

రోడ్డు బాగు చేయాలి



బాందేవుపురం-విలాస్కాన్‌పాలెం రోడ్డు మీదుగా సీజన్‌లో పండే మామిడి వంటి పండ్లను విలాస్కాన్ పాలెం, విజయనగరం జిల్లా అన్నంరాజుపేట, జామి గ్రామాలకు మోపెడ్‌పై తీసుకు వెళ్లి అమ్ముతుంటాం. రోడ్డు గోతులు పడి అధ్వానంగా ఉండడంతో దీనిపై రాకపోకలు సాగించడానికి అవస్థలు పడుతున్నాం. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

– జె.శ్రీనివాసరావు, బాందేవుపురం

సాగర సంగమం వద్ద రేపు పానిహతి ఉత్సవం

తగరపువలస: భీమిలిలోని గోస్తని నది సాగర సంగమ తీరంలో ఆనందపురం మండలం గంభీరం హరేకృష్ణ వైకుంఠం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం పానిహతి చిదా దహి ఉత్సవం నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధి అంబరీష దాస తెలిపారు. కృష్ణ తత్వాన్ని అన్ని ప్రాంతాల్లో వ్యాప్తి చేయడంలో భాగంగా ప్రాచీన కాలం నుంచి ఈ కార్యక్రమాన్ని సంప్రదాయంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ఇక్కడ సాయంత్రం 4 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఉత్సవంలో భాగంగా సంకీర్తనలు పాడతారని, సప్త నదుల నుంచి సేకరించిన జలాలతో శ్రీకృష్ణ, బలరాములకు అభిషేకాలు నిర్వహిస్తారని, నదిలో వీరి విగ్రహాలతో తెప్పోత్సవం జరుగుతుందని తెలిపారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేస్తారని, పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొనాలని కోరారు.

ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తాం



సాగర్‌నగర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఏఎంవోహెచ్ కిషోర్

సాక్షి ఎఫెక్ట్..

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో పాలిథిన్ కవర్ల నిషేధంపై పూర్తిస్థాయి ప్రచారం నిర్వహించామని, ఇక నుంచి ప్రతిరోజూ సాగర్‌నగర్, రుషికొండ, ఎండాడ వంటి పలు ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామని ఏఎంవోహెచ్ ఎన్.కిషోర్ అన్నారు. సాక్షి దినపత్రికలో 'ప్లాస్టిక్ నిషేధం .. ప్రచారానికే పరిమితం' శనివారం శీర్షికతో ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. సాగర్‌నగర్‌లో జీవీఎంసీ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించి, పాలిథిన్ కవర్లను స్వాధీనం చేసుకుని ఫైన్లు వేశారు. ఎవరైనా పాలిథిన్ కవర్లను వినియోగిస్తే ఇకపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్లుప్తంగా

కమనీయం.. వేణుగోపాలుని కల్యాణం



స్వామి కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో శుక్రవారం రాత్రి వేణుగోపాల స్వామి కల్యాణం కనులపండువగా జరిగింది. ముందుగా రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి విగ్రహాలను పల్లకీలో గ్రామంలో ఊరేగించారు. తదుపరి ఈ విగ్రహాలను ఆలయంలోకి తోడ్కొని వచ్చి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం వేణుగోపాల స్వామి కల్యాణాన్ని వేద పండితుల వేద మంత్రోచ్చరణల నడుమ నిర్వహించారు. అధిక సంఖ్యలో తరలి వచ్చిన గ్రామస్తులు వేణుగోపాల స్వామి కల్యాణాన్ని కనులారా వీక్షించారు.

యోగాతో ఆరోగ్యకర జీవనం



కళాశాల వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భీమునిపట్నం: యోగాను జీవితంలో భాగం చేసుకుంటే అనారోగ్య సమస్యలు ఉండవని భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ అన్నారు. కళాశాలలో శనివారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆమె మాట్లాడారు. మానసిక ఒత్తిడి, శారీరక ఇబ్బందులను ఎదుర్కొనేందుకు సరైన మార్గం యోగానే అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాపై ప్రచారం నిర్వహించాలని, ఈ నెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి అందరూ హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి రూ.40వేల సాయం



పీతల నాగమణికి రూ.40వేలు అందిస్తున్న ఆనందపురం నాయకులు

తగరపువలస: ఆనందపురం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన పీతల శ్రీను కుటుంబానికి స్థానికులు శనివారం రూ.40వేల ఆర్థిక సాయం అందించారు. ఈ మొత్తాన్ని శ్రీను భార్య నాగమణి చేతికి అందించారు. భర్త చనిపోవడంతో వారి కుటుంబ ఆర్థిక సమస్యలు గమనించి, ఈ మొత్తాన్ని అందించినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో కుప్ప రామలక్ష్మి, తాడివాడ శివకృష్ణ, తమ్మిన అప్పలరాజు, లొడగల సురేష్, కోరుకొండ మూర్తి, బాయిన ఆనంద్, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.


శ్రీవారి లడ్డూ కోసం బారులు తీరిన భక్తులు



లడ్డూ కౌంటర్ వద్ద క్యూలో ఉన్న భక్తులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ముందుగా ఆలయానికి చేరుకున్న భక్తులు శ్రీవారి పాదాల వద్ద కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవారిని, పద్మావతి, గోదాదేవి అమ్మవార్లను దర్శించుకున్నారు. శ్రీవారి లడ్డు విక్రయాల వద్ద భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో శ్రీవారి భక్తులు నిర్వహించిన కోలాటం భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపిక



పీఎం పాలెం: గతేడాది డిసెంబర్‌లో జాతీయ స్థాయిలో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో ఆరోవార్డు పరిధి పీఎం పాలెం లక్ష్మీవానిపాలెం యూపీ స్కూల్ 8వ తరగతి విద్యార్థి బనిసెట్టి పూర్ణచంద్రరావు ఎంపికయ్యాడు. ఈ విద్యార్థికి 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏటా రూ.12,500 ప్రోత్సాహక స్కాలర్‌షిప్‌ను కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. పూర్ణచంద్రరావును పాఠశాల హెచ్ఎం ఎ.లక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి



మధురవాడ జోనల్ ఆఫీసు వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

మధురవాడ: రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో 12 గంటల పని దినాన్ని అమలు చేస్తానని కూటమి ప్రభుత్వం నిర్ణయించడం దుర్మార్గమని సీఐటీయూ మద్దిలపాలెం జోన్ అధ్యక్షుడు డి.అప్పలరాజు అన్నారు. మధురవాడ జోనల్ ఆఫీసు వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్ అమలు చేసే ఆలోచనలో భాగమే ఇదని, తక్షణమే ఈ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మిక వర్గం నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. కార్మిక వ్యతిరేక విధానాలను వెంటనే విడనాడాలన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నరసింగరావు, జానకి, అచ్చియ్యమ్మ, చిన్న, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

10న దుర్గాలమ్మ వారాల పండగ



సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టుపై వెలసిన దుర్గాలమ్మ వారి వారాల పండగను 10వ తేదీన నిర్వహిస్తున్నట్టు కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు తెలిపారు. కమిటీ, గ్రామపెద్దలతో ఆలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఏటా నిర్వహిస్తున్నట్టే అమ్మవారి పండగను పౌర్ణమికి ముందు వచ్చే మంగళవారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఉంటాయన్నారు. సమావేశంలో ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, కార్యదర్శి నాగోతి తాతారావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ముగ్గురు అమ్మవార్ల ఆలయాలు ప్రారంభం



అర్చకునిపాలెంలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేసిన ముగ్గురు అమ్మవార్ల ఆలయాలు



ప్రతిష్ఠించడానికి ధాన్యంలో మూసి ఉంచిన మూడు పూర్ణ కలశాలు

పద్మనాభం: పద్మనాభం పంచాయతీ అర్చకునిపాలెంలో నూతనంగా నిర్మించిన ముగ్గురు అమ్మవార్ల ఆలయాల ప్రారంభోత్సవం ఆదివారం జరగనుంది. ఇందుకు ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. గ్రామంలో పైడితల్లమ్మ, ముత్యాలమ్మ, మరిడమ్మలకు ఆలయాలు, విగ్రహాలను నిర్మించారు. పూర్ణ కలశాలను తయారు చేశారు. గ్రామస్తుల నుంచి విరాళాల రూపంలో సేకరించిన రూ.4లక్షలతో వీటిని నిర్మించారు. హోమాలు నిర్మించడానికి యాగశాల నిర్మించారు. ఆలయం ముందు కొబ్బరాకులతో పందిరి వేశారు. పూర్ణ కలశాలను బంగారమ్మ ఆలయంలో పైకి కనిపించకుండా ధాన్యంలో మూసి ఉంచారు. ఉదయం ముందుగా పద్మనాభం గ్రామంలోని గోస్తని నది జలాలను మహిళలు కలశాలతో పట్టుకుని వెంట సాగగా పూర్ణకలశాలను ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు తోడ్కొని వస్తారు. గోస్తని జలాలతో అమ్మవార్లకు అభిషేకాలు చేసిన అనంతరం పూర్ణ కలశాలను ఆలయాలపై ప్రతిష్ఠించనున్నారు.

గెడ్డ ఆక్రమణ



ఆక్రమణకు గురైన గెడ్డ

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో ఆక్రమణల జోరు ఏమాత్రం ఆగడం లేదు. సంబంధిత అధికారులు నామమాత్రంగా చర్యలు తీసుకోవడంతో ఆక్రమణదారులు కొండలను, చెరువులను, గెడ్డలను యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. సాగర్‌నగర్ దరి తాటిచెట్లపాలెంలో ఓ వ్యక్తి గెడ్డను డెబ్రిస్‌తో నింపి పూర్తిస్థాయిలో ఆక్రమించేశాడు. ప్రస్తుతం ఈ ప్రాంతానికి ఇక గెడ్డ లేనట్లే. ఇంత జరుగుతున్నా ఒక్క అధికారి కూడా ఇటుగా చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇదే ప్రాంతంలో ఓ స్థానిక నాయకుడి అండదండలతో ప్రభుత్వ స్థలాలను యథేచ్ఛగా ఆక్రమించేస్తున్నా ఏ రెవెన్యూ అధికారి కూడా చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు గెడ్డను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని.. ఈ గెడ్డలో వేసిన డెబ్రిస్‌ను తొలగించి యథాస్థానానికి తీసుకుని రావాలని డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే వర్షాలు వచ్చే సమయంలో ఈ ప్రాంతానికి పెను ప్రమాదం తప్పదని పేర్కొంటున్నారు.

సమన్వయ లోపంతో..

ఇదిలా ఉండగా, ఇక్కడ రెవెన్యూ, పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల మధ్య సమన్వయ లోపం కనిపిస్తోంది. ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులదని, కాదు కాదు పట్టణ ప్రణాళికా విభాగం అధికారులదే బాధ్యత అని ఒకరిపై మరొకరు వేసుకుంటూ కాలయాపన చేస్తున్నారు. అంతేగానీ చర్యలు మాత్రం తీసుకోవడం లేదు.

కేజీహెచ్‌లో పోలీస్ అవుట్ పోస్ట్ ప్రారంభం

అల్లిపురం: కేజీహెచ్‌లో ప్రజల సౌకర్యార్థం రూ. 23 లక్షలతో నిర్మించిన నూతన ఫార్మసీ కౌంటర్, టెస్లా సెంటర్ వద్ద రోగుల కోసం నిరీక్షణ షెడ్లు, అలాగే మార్చురీ ఆవరణలో నిర్మించిన పోలీస్ అవుట్ పోస్టును ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. సీపీ బాగ్చి మాట్లాడుతూ కేజీహెచ్ పరిసరాల్లో ఐదు కిలోమీటర్ల పరిధిలో 24/7 డ్రోన్ల నిఘా ఉంటుంద ని, తద్వారా కేజీహెచ్‌లో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి సురక్షిత వాతావరణాన్ని కల్పిస్తామన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



ఆనందపురం గ్రంథాలయంలో చిన్నారుల ఆటాపాట

తగరపువలస: ఆనందపురం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఏప్రిల్ 28న ప్రారంభమైన ఈ శిబిరంలో 41రోజుల పాటు పుస్తక పఠనం చేయించారు. కథలు రాయించడంతో పాటు చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఎక్కువ రోజులు హాజరైన విద్యార్థులకు శాఖా గ్రంథాలయాధికారి బీవీఎస్ అప్పారావు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పంచాయతీ నాయకులు చందక సూరిబాబు, కొట్యాడ రెడ్డిబాబు, కొట్యాడ సత్యమూర్తి తదితరులు పాల్గొని, గ్రంథాలయాల ఆవశ్యకత గురించి స్థానికులకు వివరించారు.

భజన చెట్టు ఊరేగింపు

పద్మనాభం: మండలంలోని మద్ది పంచాయతీ తునిపాలెంలో రామాలయానికి నూతనంగా నిర్మించిన భజన చెట్టును గ్రామంలో శనివారం ఊరేగించారు. అడుగడుగున గ్రామస్తులు భజన చెట్టుకు పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, టీడీపీ మండల శాఖ మాజీ అధ్యక్షుడు కాళ్ల నగేష్ కుమార్ పాల్గొన్నారు.

సింహాచలేశునికి స్వర్ణ తులసీ దళార్చన



స్వర్ణతులసీ దళాలతో స్వామికి అర్చన చేస్తున్న అర్చకుడు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఉదయం 7గంటల నుంచి స్వర్ణ తులసీ దళార్చనను ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చి, 108 స్వర్ణ తులసీ దళాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు

తగరపువలస: చిట్టివలస సప్తగిరి థియేటర్ కూడలి వద్ద రావిచెట్టు కింద శనివారం ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం జరిగింది. పండితుడు అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఈ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు జరిగాయి. వానపల్లి సత్తిబాబు, కొండేటి గోవింద ఈశ్వరరావు, కోసూరి తాతారావు, జన్నుల నరసింగరావు, నార్ల వాసు తదితరుల సమక్షంలో హోమం నిర్వహించి, ప్రసాదాలు పంపిణీ చేశారు.

చార్జింగ్ స్టేషన్ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ శ్యామ్‌బాబు

కొమ్మాది: పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులో త్వరలో నడపనున్న డబుల్‌డెక్కర్ ఈవీలకు చార్జింగ్ స్టేషన్‌కు విద్యుదీకరణ కల్పించేందుకు భీమిలి బీచ్ రోడ్డు సాగర్‌నగర్‌లో ఏర్పాటు చేస్తున్న చార్జింగ్ స్టేషన్ పనులను ఈపీడీసీఎల్ ఎస్ఈ శ్యామ్ బాబు, ఈఈ పోలాకి శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ డబుల్‌డెక్కర్ ఈవీలకు చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ఏపీ టూరిజం ప్రతిపాదించిందని, ఈ నేపథ్యంలో ఇక్కడ జరుగుతున్న పనులు పరిశీలించినట్లు తెలిపారు.

ప్రపంచ శాంతికి పాస్టర్ల ర్యాలీ



మధురవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు

మధురవాడ: ప్రపంచ ప్రార్థన దినోత్సవాన్ని పురస్కరించుకుని మధురవాడ పరిసర ప్రాంత పాస్టర్లు, సువార్తకులు శనివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్‌షెడ్ జంక్షన్ యూనియన్ బ్యాంక్ పక్కనున్న ఆర్‌సీఎం ఖాళీ స్థలం నుంచి వాంబే కాలనీ పరిసర ప్రాంతాల్లో ర్యాలీ సాగింది. మధురవాడ జోన్ పాస్టర్లు, సువార్తకుల కన్వీనర్ ఉష ప్రభాకర్, ప్రేమ్ తరంగ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

నేడు ప్రపంచ శాంతికి ప్రార్థనలు

ప్రపంచ ప్రార్థనా దినోత్సవం సందర్భంగా కార్‌షెడ్ జంక్షన్ వద్ద ఉన్న ఆర్‌సీఎం చర్చి ఖాళీ స్థలంలో ఆదివారం సాయంత్రం 4గంటల నుంచి శాంతి ప్రార్థనలు, పాటలు, కొరియో, బుర్రకథ వంటివి ఉంటాయని కన్వీనర్లు తెలిపారు. దీనికి వాక్యోపదేశకులుగా బిషప్ కేఆర్ సింగ్ హాజరు కానున్నారన్నారు.

ఈద్గా మైదానంలో బక్రీద్ ప్రార్థనలు



ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భీమునిపట్నం: బక్రీద్‌ను ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. స్థానిక ఈద్గా మైదానంలో జామియా మసీద్ ఇమాం నసీం అక్తర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మసీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు శిల్పారామంలో కూచిపూడి నృత్య ప్రదర్శన

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుందని స్థానిక పరిపాలన అధికారి తెలిపారు. నగరానికి చెందిన సిద్ధేంద్ర యోగి నాట్యాలయం ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు.